క్లుప్తంగా

నగరవీధుల్లో హరినామ సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి కమిటీ సభ్యులు శనివారం నగరవీధులలో హరినామ సంకీర్తనలు ఆలపించారు. ముందుగా ఆలయ అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులత నగరవీధుల హరినామ సంకీర్తనలు, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ సభ్యులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుశాలపురం గ్రామ పంచాయతీ యాతపేట గ్రామంలో అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 50 పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు శనివారం పంపిణీ చేశారు. అక్షయ సేవా సమితి అధ్యక్షుడు బొడిగి మధు మాట్లాడుతూ వేసవి ప్రారంభం నేపథ్యంలో పేదలకు నిత్యావసర సరుకులు అందజేయడం లక్ష్యంగా చేసుకున్నట్లు చెప్పారు. సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు కిరణ్‌కుమార్, అనిల్‌కుమార్, సతీష్, సాయి పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు నిర్వహించారు.

లైట్‌హౌస్ సందర్శన



లైట్‌హౌస్ వద్ద యువ టూరిజం క్లబ్ విద్యార్థులు

గార: మండలంలోని కె.మత్స్యలేశం పంచాయతీ పరిధిలోని కళింగపట్నం లైట్‌హౌస్‌ను స్థానిక బుద్ధా పాఠశాలలో ఏర్పాటు చేసిన యువ టూరిజం క్లబ్ సభ్యులు శనివారం సందర్శించారు. లైట్ హౌస్ నేవిగేషనల్ అసిస్టెంట్ సుభాసిస్ సాహు మాట్లాడుతూ లైట్ హౌస్ పనిచేసే విధానం, ఆవశ్యకత, డేటా సేకరణ, రాడార్, పిడుగులు పడినప్పుడు లైటెనింగ్ అలర్ట్ తదితర వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బుద్ధా ఎర్రన్న, యువ టూరిజం కో ఆర్డినేటర్ శ్రీకుమార్, సైన్స్ ఉపాధ్యాయుడు మిథున్, ఫీల్డ్ అసిస్టెంట్ కోస్టు గైడ్ దెబాసిస్ రాజన్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

కె.మత్స్యలేశంలో ఓటరు అవగాహన ర్యాలీ



నినాదాలు చేస్తున్న మహిళలు

గార: మండలంలోని కె.మత్స్యలేశం పంచాయతీలో శనివారం మండల మహిళా సమాఖ్య సభ్యులు ఓటర్ల అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఏసీ కొండలరావు, ఏపీఎం భాగ్యలతలు మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఐదేళ్ల పాటు మంచి ప్రభుత్వం ఏర్పడేందుకు ఓటు కీలకమవుతుందని పేర్కొన్నారు. ఓటు వినియోగంపై సోషల్ మీడియా ద్వారా అవగాహన పొందవచ్చన్నారు. ఓటు హక్కు– మన జన్మ హక్కు, ఓటును నిర్భయంగా వేయండి, మంచి ప్రభుత్వం రావాలంటే ప్రలోభాలకు లొంగకండి వంటి ప్లకార్డులను ప్రదర్శించారు.

పకడ్బందీగా పోలింగ్ బాధ్యతలు

- ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓలదే కీలక పాత్ర
- గంటన్నర ముందే మాక్ పోలింగ్
- ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు చేయాల్సిందే
- శ్రీకాకుళం నియోజకవర్గ శిక్షణలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల పోలింగ్ నిర్వహణలో పీఓ, ఏపీఓ విధులు అత్యంత కీలకమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. పీఓగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఒక్క తప్పు జరగకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్లు పనితీరుపై పీఓలు, ఏపీఓలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శనివారం శ్రీకాకుళం నగరంలోని 80 ఫీట్ రోడ్డులోని ఫంక్షన్ హాల్లో శ్రీకాకుళం నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓదే పూర్తి అధికారమని చెప్పారు. అందరి విధులపైనా పీఓలకు అవగాహన ఉండాలన్నారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితిలోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. ఉదయం నుంచే వీలైనంత ఎక్కువ పోలింగ్ జరగాలన్నారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. వ్యక్తిగత అభిప్రాయాలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు.

సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలి..

ఎన్నికల నిర్వహణలో ఎటువంటి అనుమానాలు ఉత్పన్నమైనా జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీస్, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనీస్‌లను అడిగి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. హింసకు తావు లేకుండా, ఎన్నికలు తిరిగి నిర్వహించే అవసరం రాకుండా సజావుగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోందన్నారు. ఇదే లక్ష్యంతో కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

సన్నద్ధంగా ఉండాలి..

ప్రతిచోటా పోలింగ్‌కి 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్‌పోలింగ్ నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. మాక్ పోల్ అనంతరం ఈవీఎంలు డిలీట్ చేయాలని, వీవీ ప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. హ్యాండ్‌బుక్, చేయాల్సిన, చేయకూడని జాబితా, చెక్‌లిస్ట్ లను తమతో పాటు ఉంచుకోవాలన్నారు. ముందు రోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 5.30 గంటలకే మాక్‌పోల్ జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. మూడు విడతల్లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. గతంలోనూ ఎన్నికలు విధులు నిర్వహించి అనుభవం ఉన్న అధికారులే కాబట్టి ఎలక్షన్ కమిషన్ సూచనలను తప్పకుండా అమలు చేయాలన్నారు. ఓవర్ కాన్ఫిడెన్స్ పనికిరాదన్నారు. హోం వోటింగ్ ఇంత వరకు జరగలేదని, ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు మాస్టర్ ట్రైనీస్ వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, డివిజనల్ రెవెన్యూ అధికారి సీహెచ్ రంగయ్య, తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ధర్మాన ఎన్నికల ప్రచారం



శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండల పరిధిలోని తండేవలస పంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల గ్రామస్తులతో తండేవలస పంచాయతీ బెండివానిపేటలో జరిగే బహిరంగ సమావేశంలో మంత్రి ధర్మాన మాట్లాడతారని తెలిపారు. అనంతరం స్థానికంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు, పనులను వివరిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.

ఉత్తమ నాటిక ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థం'




ఉత్తమ నాటిక బహుమతి అందుకుంటున్న ఇంద్రప్రస్థం నాటిక ప్రతినిధి



ఇంద్రప్రస్థం నాటికలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు గుంటూరు, అభినయ ఆర్ట్స్ వారి 'ఇంద్రప్రస్థం', కొప్పోలు, పండు క్రియేషన్స్ వారి 'పక్కింటి మొగుడు' నాటికలు ఆద్యంతం అలరించాయి. గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి 'ఇంద్రప్రస్థం' నాటికకు ప్రథమ, హైదరాబాదు, గోవాడ క్రియేషన్స్ వారి 'మూల్యం' నాటిక ద్వితీయ, కొప్పోలు పండు క్రియేషన్స్ వారి 'పక్కింటి మొగుడు'కు తృతీయ ఉత్తమ ప్రదర్శన బహుమతులు దక్కాయి. న్యాయనిర్ణేతలుగా మానాపురం సత్యనారాయణ (పాలకొల్లు), డి.హేమవెంకటేశ్వరి(విశాఖ), పి.దయానందబాబు (కాకినాడ)లు వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సుమిత్రా కళాసమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, నక్క శంకరరావు, కొంక్యాన మురళీధర్, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, టి.నీరజ, మల్లెమొగ్గల రాజు, మెట్ట పోలినాయుడు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి విశేష పూజలు



నారాయణ తిరుమలలో వెంకన్న స్వామి



దూదివారి కోవెలలో పూలమాలలతో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలో ఉత్తరాంధ్ర తిరుమల కొండగా పేరుపొందిన నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు.

- చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని పూలమాలలతో అలంకరించారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



హయాతినగరం పోలింగ్ కేంద్రంలో ఎస్ఐ గణేష్

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని హయాతినగరం పోలింగ్ కేంద్రాన్ని శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు, ఓటర్లు వెళ్లి, తిరిగి వచ్చే మార్గాలపై ఆరా తీశారు. సిబ్బందితో మాట్లాడి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



బలగ కూడలిలో రాత్రిగస్తీలో ఎస్ఐ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికి ఎట్టి పరిస్థితుల్లో గదులు ఇవ్వవద్దని శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్ఐ హరికృష్ణ అన్నారు. శనివారం అర్ధరాత్రి బలగ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు పరిసర ప్రాంతాల్లో రాత్రిగస్తీ విధులు నిర్వర్తించారు. పలు లాడ్జీలు, ఆర్టీసీ కాంప్లెక్సు, దుకాణాల సముదాయాలను పరిశీలించారు. ఎటువంటి అలజడులు జరిగినా తక్షణమే డయల్ 100కు తెలియజేయాలన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



ఒకటో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్



రెండో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్

శ్రీకాకుళం క్రైమ్ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరుతూ శ్రీకాకుళం ఒకటి, రెండో పట్టణ పోలీసులు శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాలతో బలగ కూడలి సమీపంలోని అవినీతి నిరోధక కార్యాలయం నుంచి స్టేట్‌బ్యాంకు వరకు, దమ్మలవీధి నుంచి కంద్రవీధి, హయాతినగరం వరకు కేంద్ర బలగాలతో కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు, ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఎవరైనా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ బలివాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి'

ఎచ్చెర్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం రామ్మూర్తి సూచించారు. మండలంలోని లింగాలపేట గ్రామంలో వెలుగు, సచివాలయం సిబ్బంది, ఆశవర్కర్లు, ఎస్‌హెచ్‌జీ సంఘాల సభ్యులు కలిసి అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఓటు ఎన్‌రోల్‌మెంట్, ఓటువేసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం నమ్మొద్దు

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజలు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం నమ్మవద్దని, ప్రజలకు మేలు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. మండలంలోని సంతసీతారాంపురం, అజ్జరాం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఐదేళ్ల పాలనలో 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేక రాష్ట్రంలో ప్రతిపక్షాలు కుటిల కూటమితో వస్తున్నాయని దుయ్యబట్టారు. కూటమి నాయకులకు ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకరరావు, నాయకులు బోర సాయిరాంరెడ్డి, దుంప చిన్నారెడ్డి, బోర గోవిందరావు, గవిరెడ్డి రవికుమార్, సుగ్గు స్రవంతి, దుంప అప్పయ్యమ్మ, సీరపు శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఎచ్చెర్ల గెలుపును జగనన్నకు కానుకగా ఇద్దాం'

జి.సిగడాం:



సంక్షేమ పథకాలు వివరిస్తున్న పరిమళ

ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్‌కుమార్‌ను గెలిపించి, జగనన్నకు కానుకగా ఇద్దామని కిరణ్‌కుమార్ సతీమణి గొర్లె పరిమళ పిలుపునిచ్చారు. మండలంలోని మెట్టవలస గ్రామంలో ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, రాష్ట్ర డైరెక్టర్ వాండ్రంగి అరుణకుమారి, మండల బూత్ కమిటీ కన్వీనర్ అబోతుల జగన్నాథం, డకర సురేష్‌కుమార్, ఏఎంసీ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల, మండల మహిళా కన్వీనర్లు కంది రమాదేవి, గురాన మానస, స్థానిక నాయకులు డకర కృష్ణ, డకర సన్యాసినాయుడు, డకర రామకృష్ణ, లాభాన కన్నంనాయుడు, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటసాయి, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునః ప్రతిష్టకు ఏర్పాట్లు



పనులు పరిశీలిస్తున్న సేవాట్రస్ట్ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేటలో శ్రీరంగనాయకీ, గోదా సమేత శ్రీరంగనాథ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, పునః ప్రతిష్ట మహోత్సవ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఐదు రోజులు పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించనున్నారు. ప్రత్యేక ప్రతిష్ట మహోత్సవ పూజలు త్రిదండి చినజీయర్ స్వామి ముచ్చింతల్ ఆశ్రమం వేద పండితులు నిర్వహించనున్నారు. చివరి రోజు చినజీయర్‌స్వామి హాజరుకానున్నారు. మొదటి రోజు రంగనాథ స్వామి ధ్రువమూర్తులతో శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఏర్పాట్లును రంగనాథస్వామి సేవాట్రస్ట్ అధ్యక్షుడు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పైడి రంగనాథం, కోశాధికారి సూర శ్యామలరావు, సెక్రటరీ పైడి రామన్న, జాయింట్ సెక్రటరీ పైడి నాగేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు.

కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్



ప్రయాణికులను ఆర్టీసీ బస్సు ఎక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఒకటి, రెండు డిపోల మేనేజర్లు, అధికారులు, సిబ్బంది శనివారం కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రెండు కిలోమీటర్లు పరిధిలో ఎటువంటి ప్రయివేటు వాహనాలు నిలుపుదల చేయరాదని మోటారు వెహికల్ చట్టం చెబుతోందన్నారు. ఏ ప్రయివేటు వాహనాలైనా కాంప్లెక్స్ ఆవరణలో నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులు ప్రయివేటు వాహనాలవైపు మొగ్గు చూపకుండా ఆర్టీసీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్ఎం కె.నరేంద్ర, టీఐ–3 ఎల్ఎస్ నాయుడు, ప్రసాద్, ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లపై చంద్రబాబుకు అక్కసు

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం: డ్రైవర్లను చులకనగా చూస్తూ చంద్రబాబు తన అక్కసు వెళ్లగక్కుతున్నాడని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుపేద టిప్పర్ డ్రైవర్ అయినటువంటి వీరాంజనేయులుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టిక్కెట్టు ఇస్తే చంద్రబాబు హేళనగా మాట్లాడడం సరికాదన్నారు. చట్ట సభలకు వెళ్లేందుకు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉంటాయని గమనించాలన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు పద్ధతి మార్చుకోవాలన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నమ్మకానికి మారుపేరు శ్రీకాశికి జ్యూయలర్స్



మంత్రి ధర్మానకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వ్యాపార రంగంలో నమ్మకం, నాణ్యతతో ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తి పేర్ల సాంబమూర్తి అని, నమ్మకానికి మారుపేరుగా శ్రీకాశికి జ్యూయలర్స్ నిలుస్తుందని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలో నూతనంగా ప్రారంభించిన శ్రీ కౌశిక్ జ్యూయ లర్స్‌ను శనివారం సందర్శించారు. మంత్రితో పాటు మండవల్లి రవి ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన దేవరశెట్టి సురేష్, పూర్వ దంపతులు శనివారం రూ.1,00,001 విరాళాన్ని ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. దాతల ప్రోత్సాహంతో వందలాది మందికి నిత్యాన్నదానం అందుతోందని ఈవో తెలిపారు.

70 మద్యం బాటిళ్ల పట్టివేత

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేట సమీపంలో 70 మద్యం బాటిళ్లతో బైక్‌పై వెళ్తున్న యువకున్ని, మహిళను రెండో పట్టణ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. సీఐ గుండు మోను ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. ఫాజుల్‌బేగ్‌పేటకు చెందిన కోనాడ శ్యామసుందరరావు, అల్లాన వరలక్ష్మిలు ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం బాటిళ్లు కొని తరలిస్తున్నారన్న సమాచారంతో సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ హరికృష్ణలు సిబ్బందితో మాటువేసి పట్టుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి మద్యం బాటిళ్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.